క్లుప్తంగా

తొండవరంలో నేడు 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ'

అంబాజీపేట: బాబు ష్యూరిటీ... మోసం గ్యారంటీ కార్యక్రమం సోమవారం ఉదయం 9 గంటలకు తొండవరంలో నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి పార్టీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా పాల్గొంటారన్నారు. మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అనుబంధ విభాగాల నాయకులు పాల్గొనాలని శేఖర్ పిలుపునిచ్చారు.

అంతర్వేది క్షేత్రంలో వైభవంగా శ్రీకృష్ణాష్టమి



అంతర్వేది క్షేత్రంలో ఉట్టికొట్టే కార్యక్రమంలో పాల్గొన్న గ్రామస్తులు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద ఆదివారం శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా గ్రామస్తులు ఉట్టికొట్టే కార్యక్రమం స్థానిక యాదవ సంఘం, యూత్ ఆధ్వర్యంలో ఉత్సాహంగా నిర్వహించారు. తొలుత శ్రీకృష్ణ పరమాత్మకు అర్చకులు వేదమంత్రాలతో పూజలు నిర్వహించారు. అనంతరం ఆనందోత్సాహాల మధ్య యువకులు పోటాపోటీగా ఉట్టికొట్టారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ఎంకేటీఎన్‌వీ ప్రసాద్, వాహనకారులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. సఖినేటిపల్లికి చెందిన భక్త బృందం సభ్యులచే మురళీ కోలాటం నిర్వహించారు.

బాలాజీ ఆలయానికి పోటెత్తిన భక్తులు

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామి ఆలయానికి ఆదివారం రూ.1,52,763 ఆదాయం వచ్చింది. పవిత్ర శ్రావణమాసం ఆదివారం సెలవు రోజు కావడంతో అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారి దర్శనానికి వచ్చారు. పవిత్ర వైనతేయ గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించి, శ్రీదేవి, భూదేవి సమేతుడైన బాల బాలాజీ స్వామిని భక్తులు దర్శించుకున్నారు. స్వామి వారి నిత్య అన్నదానం ట్రస్టుకు భక్తులు రూ.58,998 విరాళాలుగా అందించారు. స్వామి వారిని 2,600 మంది దర్శించుకున్నారని ఆలయ ఈఓ వి.సత్యనారాయణ తెలిపారు. 1,500 మంది స్వామి వారి అన్న ప్రసాదం స్వీకరించారన్నారు.

విఖనస స్వామికి పూజలు

ఆలమూరు: స్థానిక శ్రీదేవిభూదేవి సమేత జనార్దనస్వామి ఆలయంలో ఆదివారం విఖనస స్వామి జయంతి వేడుకలు వైభవంగా నిర్వహించారు. స్థానిక ఆలయ ఆవరణలోని విగ్రహం వద్ద మండలం వైఖానస సంఘం ఆధ్వర్యంలో వేద పండితులు సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం, విశేష తులసి దళార్చన నిర్వహించారు. అంగర సత్యనారాయణాచార్యులు, అంగర గోపాలాచార్యులు, భగవాన్, సింగ్‌బాబు, గోపి, ప్రభాకరాచార్యులు పాల్గొన్నారు.

ఆరుగురు జూదరుల అరెస్టు

అయినవిల్లి: పేకాట స్థావరంలో దాడి చేసి ఆరుగురు జూదరులను ఆదివారం రాత్రి అరెస్టు చేసినట్టు అయినవిల్లి ఎస్సై హరికోటి శాస్త్రి తెలిపారు. తొత్తరమూడి చెరువుగట్టు వద్ద కొందరు పేకాట ఆడుతున్నట్టు ఇచ్చిన సమాచారంతో ఎస్సై తన సిబ్బందితో కలసి పేకాట స్థావరంపై దాడి చేశారు. ఈ దాడిలో ఆరుగురు జూదరుల నుంచి రూ.1,940 నగదును స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

కుందాలపల్లి రోడ్డుకు శంకుస్థాపన

పి.గన్నవరం: రహదారుల అభివృద్ధి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. పప్పులవారి పాలెం నుంచి కుందాలపల్లి వరకూ 1.1 కిలోమీటర్ల పొడవున రూ.77.30 లక్షల వ్యయంతో బీటీ రోడ్డు నిర్మాణానికి ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ పప్పుల శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏఎంసీ చైర్‌పర్సన్ పెనుమాల లక్ష్మి, ఎంపీటీసీ పప్పుల సాయిబాబు పాల్గొన్నారు.

రైతులకు మెరుగైన సేవలందించాలి

అంబాజీపేట: రైతులు ఆర్థిక పురోభివృద్ధి చెందేలా మార్కెట్ కమిటీలు మెరుగైన సేవలు అందించాలని ఆ దిశగా నూతన పాలకవర్గం పని చేయాలని ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, పొలిట్ బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం అన్నారు. అంబాజీపేట మార్కెట్ కమిటీ నూతన కార్యవర్గం పదవీ బాధ్యతలను పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అధ్యక్షతన ఆదివారం స్వీకరించారు. ఈ సందర్భంగా రాజశేఖర్, సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ మార్కెట్ కమిటీలు రైతులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పించాలన్నారు. ఎమ్మెల్యే సత్యనారాయణ ఆధ్వర్యంలో మార్కెట్ కమిటీ చైర్మన్‌గా చిట్టూరి శ్రీనివాస్, వైస్ చైర్మన్ కొర్లపాటి వెంకటేశ్వరరావు, నూతన పాలకవర్గంతో పదవీ ప్రమాణం చేయించారు. నగరం మార్కెట్ కమిటీ చైర్మన్ పెనుమాల లక్ష్మి, మాచవరం సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి, నాయకులు పాల్గొన్నారు.

వానల జోరు.. జ్వరాల విజృంభణ

- గ్రామాల్లో క్షీణించిన పారిశుధ్యం
- ఇంటింటా అంటువ్యాధుల పీడితులు
- దోమలు ఉధృతి పెరగడంతో వ్యాధుల వ్యాప్తి
- రోగులతో కిటకిటలాడుతున్న ఆస్పత్రులు



కలవచర్లలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారిణి భాగ్యశ్రీ



కడియం-వెదురుమూడి రోడ్డు పక్కన అపరిశుభ్రత

ఆలమూరు: వాతావరణ పరిస్థితులతో పాటు వాయవ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావం వల్ల ఇటీవల జోరుగా కురుస్తున్న వర్షాలకు జనజీవనం స్తంభించింది. ఇంట్లోంచి బయటకు వచ్చి దైనందిన కార్యక్రమాలను చేసుకోలేని పరిస్థితి నెలకొంది. అదే సమయంలో వర్షాల ప్రభావంతో చెత్త చెదారం, వ్యర్థాలు రహదారులు, కూడళ్లు, డ్రెయిన్లలో పడవేయడంతో గ్రామాల్లో పారిశుధ్యం క్షీణించింది. అపరిశుభ్రత కారణంగా ప్రజలు జ్వరాలు, అంటు వ్యాధుల బారినపడుతున్నా అధికారులు నివారణ చర్యలు తీసుకున్న దాఖలాల్లేవు.

వాతావరణంలో మార్పులతో ప్రబలుతున్న రోగాలు

క్లస్టర్ పరిధిలోని కొత్తపేట, రాజోలు, పి.గన్నవరం నియోజకవర్గాల్లోని ఆయా మండలాల్లో 23 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, నాలుగు సామాజిక ఆస్పత్రుల్లో నిత్యం వందలాది మంది రోగులు చికిత్స పొందుతున్నారు. ఇంటింటా జ్వర పీడితుల సంఖ్య అధికమైంది. ప్రధానంగా ఒళ్లు నొప్పులు, దగ్గు, జలుబు, రొంప లక్షణాలు ఎక్కువ మందికి ఉండటంతో వారిని రోజుల తరబడి నీరసం వేధిస్తోంది. ఏడాది కంటే ఇప్పుడు జ్వరాల తీవ్రత అధికంగా ఉందని వైద్యులు చెబుతున్నారు. వాతావరణంలో సంభవిస్తున్న మార్పులతోపాటు అపరిశుభ్రత వల్ల దోమలు ఉధృతి అధికమవడంతో పల్లెలు, పట్టణాలు అనే తారతమ్యం లేకుండా వ్యాధులు వ్యాపిస్తున్నాయి.

పారిశుధ్యంపై దృష్టి కేంద్రీకరించాలి

రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ఆదేశాల మేరకు ప్రతి శుక్రవారాన్ని డ్రైడేగా పాటిస్తూ పారిశుధ్య కల్పనపై ప్రజలను చైతన్యవంతం చేస్తున్నా ఫలితం కన్పించడం లేదు. ఇటీవల ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పారిశుధ్యం పూర్తిగా లోపించింది. ప్రజా సంక్షేమంతో పాటు పారిశుధ్య కల్పన ధ్యేయంగా ప్రభుత్వం పనిచేయాలని ప్రజలు కోరుతున్నారు. జనాభాకు అనుగుణంగా ఆయా గ్రామ పంచాయతీలు పారిశుధ్య కార్మికులను నియమించుకోవడం ద్వారా అధ్వాన పారిశుధ్యం నుంచి బయటపడవచ్చనని అభిప్రాయం వ్యక్తమవుతోంది. గ్రామ పంచాయతీ పాలక వర్గాలు పారిశుధ్యం విషయంలో రాజీ లేకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

కిటకిటలాడుతున్న ప్రభుత్వ ఆస్పత్రులు

క్లస్టర్ పరిధిలోని మూడు నియోజకవర్గాల పరిధిలోనున్న ప్రభుత్వ ఆస్పత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. 11 మండలాల్లోనున్న పీహెచ్‌సీల్లో ప్రతి రోజు సగటున 200 మంది రోగులు వైద్య సేవలు పొందుతుండగా ఆలమూరు, కొత్తపేట, రాజోలు, పి.గన్నవరం సీహెచ్‌సీల్లో సీహెచ్‌సీల్లో దాదాపు 500 మంది రోగులు చికిత్స కోసం వస్తుంటారు. అందులో అధిక సంఖ్యలో టైఫాయిడ్, మలేరియా, చికెన్ గున్యా, డెంగీ వంటి వ్యాధులతో బాధపడుతున్నారు. జ్వరాలకు చికిత్స పొందుతుండగానే రక్త కణాల సంఖ్య తగ్గిపోయి ఒక్కొక్కసారి రోగి ప్రాణ ప్రాయ స్థితికి చేరుకున్న పరిస్థితులున్నాయి.

ఆస్పత్రుల్లో వేధిస్తున్న మందుల కొరత

క్లస్టర్ పరిధిలోని కొన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సీజనల్ వ్యాధుల నియంత్రణకు ఉపయోగించే ఔషధాలు కొరతతీవ్రంగా వేధిస్తోంది. జ్వరం సోకిన వ్యక్తికి రోజుల వ్యవధిలో చికిత్స అందించడంతో కొంతమేర ఆరోగ్య రక్షణకు తోడ్పాటును అందిస్తుంది. దీనివల్ల రోగులు ప్రైవేట్ వైద్యుల వద్దకు వెళ్లి ఆర్థికంగా నష్టపోతున్నారు. జ్వరం వస్తే చాలు రూ.వేలల్లో ఖర్చు అవుతోందని వారు వాపోతున్నారు.

వ్యాధుల నియంత్రణకు చర్యలు



అధిక వర్షాల ప్రభావంతో పాటు వాతావరణంలో మార్పుల వల్ల సంభవించే సీజనల్ వ్యాధుల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నాం. క్షేత్రస్థాయిలో వైద్య ఆరోగ్య సిబ్బందిని అప్రమత్తం చేశాం. ఆయుష్మాన్ మందిరాల ద్వారా రోగులకు తగిన చికిత్స అందించి ఉచితంగా మందులు సరఫరా చేస్తున్నాం. గ్రామ పంచాయతీల సహకారంతో సంపూర్ణ పారిశుధ్య చర్యలు చేపడుతున్నాం.

– ఏవీవీ రాజా అక్కుల, హెల్త్ ఎడ్యుకేటర్, పీహెచ్‌సీ పెదపళ్ల

హామీలు విస్మరించడం చంద్రబాబు నైజం

- ప్రజలపై కపట ప్రేమ చూపిస్తున్న కూటమి నేతలు
- 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ' సభలో వైఎస్సార్ సీపీ నేతల విమర్శ



చెముడులంకలో క్యూఆర్ కోడ్ పత్రాలతో వైఎస్సార్ సీపీ నేతలు

ఆలమూరు: రాష్ట్రంలో అధికారంలోకి రావడానికి ప్రజలకు అడ్డగోలుగా ఇచ్చిన హామీలను విస్మరించి పబ్బం గడుపుకోవడం, లేని విషయాన్ని ఉందని ప్రచారం చేసుకోవడం సీఎం చంద్రబాబు నైజమని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు అన్నారు. మండలంలోని చెముడులంక, నర్శిపూడిలో మండల వైఎస్సార్ సీపీ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ' కార్యక్రమంలో ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ తోరాటి సీతామహాలక్ష్మి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పార్టీ నేతలు పాల్గొని ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కూటమి నాయకులు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను సక్రమంగా అమలు చేయకుండా మోసాలు, అబద్ధపు ప్రచారాలతో కాలక్షేపం చేస్తోందన్నారు. జోరున కురుస్తున్న వర్షాన్ని సైతం లెక్కచేయకుండా అధిక సంఖ్యలో గ్రామస్తులు తరలివచ్చి సభను విజయవంతం చేశారు. కొన్నేళ్లుగా పింఛన్‌ను తీసుకుంటున్నామని హఠాత్తుగా అనర్హులంటూ తొలగించడంపై దివ్యాంగులు కన్నీటి పర్యంతమయ్యారు. అన్నదాత సుఖీభవ పథకంలో కౌలురైతులను విస్మరించారని ఆరోపించారు. బీసీ, ఎస్సీ మహిళలకు 45 ఏళ్లకే పింఛన్ అందిస్తామన్న హామీని సీఎం చంద్రబాబు బుట్టదాఖలు చేశారన్నారు. అధికారంలో వస్తే విద్యుత్ చార్జీలను పెంచేది లేదని ఇచ్చిన హామీని తుంగలో తొక్కి పలుమార్లు భారీగా చార్జీలు పెంచిన విషయాన్ని వారు గుర్తు చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో కులమతాలు, పార్టీలకతీతంగా మేలు చేస్తే ప్రస్తుత కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలులో పక్షపాత వైఖరిని అవలంబిస్తోందని విమర్శించారు. జిల్లా వ్యాప్తంగా సహజ వనరులు దోపిడీకి గురవుతున్నాయని ఆవేదన చెందారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఏవిధంగా నిర్వీర్యం చేస్తుందన్న విషయాన్ని క్యూఆర్ కోడ్ ద్వారా వైఎస్సార్ సీపీ నేతలు గ్రామస్తులకు సమగ్రంగా వివరించారు.

గ్రామ కమిటీల ఎన్నిక

చెముడులంక, నర్శిపూడికి చెందిన వైఎస్సార్ సీపీ కమిటీల ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. చెముడులంక గ్రామ కమిటీ అధ్యక్షుడిగా దొండపాటి వెంకటేశ్వరరావు, నర్శిపూడి గ్రామ కమిటీ అధ్యక్షుడిగా పేరూరి వీరబాబుతో పాటు సభ్యుల బృందాన్ని మండల కన్వీనర్ తమ్మన నియమించారు. వైఎస్సార్ సీపీ నేతలు యనమదల నాగేశ్వరరావు, నామాల శ్రీనివాసు, నాంద్ర నాగమోహన్‌రెడ్డి, దొండపాటి చంటి, కందిబొట్ల రమణ, ఎంఎస్ఏ శాస్త్రి, సర్పంచ్ కందిబొట్ల శ్రీనివాసు, ఎంపీటీసీ మేడిశెట్టి సుబ్బారావు పాల్గొన్నారు.

అసంపూర్తిగా తహసీల్దార్ కార్యాలయ నిర్మాణం



అంబాజీపేటలో అసంపూర్తిగా ఉన్న తహసీల్దార్ కార్యాలయ భవనం

అంబాజీపేట: అసంపూర్తిగా నిలిచిన అంబాజీపేట తహసీల్దార్ భవన నిర్మాణాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పూర్తి చేయాలని పలువురు కోరుతున్నారు. 2018 టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.90 లక్షలతో తహసీల్దార్ భవన నిర్మాణానికి, స్థానిక పశువుల మార్కెట్ వద్ద భూమి పూజ చేశారు. భవన నిర్మాణ పనులు సుమారు 50 శాతం పూర్తయ్యాయి. మిగిలిన పనులు పూర్తి చేయకుండా అప్పటి ప్రజాప్రతినిధులు గాలికొదిలేశారు. ఇచ్చిన నిధులు అరకొరగా మంజూరవ్వడంతో కాంట్రాక్టరు పని చేయకుండా చేతులెత్తేశారని అధికారులు చెబుతున్నారు. తహసీల్దార్ భవనం అసంపూర్తిగా దర్శనమిస్తున్నా అధికారులు పట్టనట్టు వ్యవహరించడంపై పలువురు విమర్శిస్తున్నారు. ప్రసుతం పాత తహసీల్దార్ కార్యాలయంలోని ఇరుకు గదుల్లోనే అధికారులు విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి అసంపూర్తిగా ఉన్న తహసీల్దార్ భవనాన్ని పూరి స్థాయిలో నిర్మించి వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

ఆది గణపతి ఆలయానికి భక్తుల తాకిడి



అయినవిల్లి విఘ్నేశ్వరస్వామి దర్శనం కోసం వేచి ఉన్న భక్తులు

అయినవిల్లి: ఆది గణపతి అయినవిల్లి విఘ్నేశ్వరాలయానికి ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధానార్చకుడు మాచరి వినాయకరావు ఆధ్వర్యంలో స్వామికి తెల్లవారు జామున మేలుకొలుపు సేవ, పంచామృతాభిషేకం, ఏకదశ, లఘున్యాస పూర్వక అభిషేకాలు, శ్రీలక్ష్మీగణపతి హోమం, గరిక పూజ నిర్వహించారు. అర్చకులు స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. స్వామి వారి సన్నిధిలో చిన్నారులకు అక్షరభ్యాసం, తులాభారం, అన్నప్రాసన కార్యక్రమాలు, వాహన పూజలు నిర్వహించారు. 2,400 మంది భక్తులు స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. ఆదివారం స్వామివారికి వివిధ పూజ టికెట్లు, అన్నదాన విరాళాలు ద్వారా రూ.2,63,403 ఆదాయం లభించినట్లు ఆలయ ఇన్‌చార్జ్ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ అల్లు వెంకటదుర్గ భవాని తెలిపారు.

స్తంభించిన జనజీవనం



పినపళ్లలో భారీ వర్షాలకు మూతబడిన ఇటుక బట్టీ

ఆలమూరు: భారీ వర్షం వల్ల జనజీవనం స్తంభించింది. ఆదివారం ఎడతెరిపిలేని వర్షం కారణంగా ప్రజలకు దైనందిన కార్యకలాపాలు నిర్వహించుకోలేని పరిస్థితి ఏర్పడింది. రహదారులపై గోతుల్లో వర్షం నీరు చేరడంతో వాహనచోదకులకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి.బట్టీల్లో కళ్లాల మీద ఉన్న ఇటుక తడిసి ముద్దవ్వడంతో యజమానులకు తీవ్ర నష్టం వాటిల్లింది. వర్షాల వల్ల బట్టీ కార్మికులు ఉపాధి కోల్పోయారు.



కొత్తూరు-వెదురుమూడి రోడ్డుపై గోతుల్లోకి చేరిన వర్షపునీరు

కొబ్బరి డొక్కలతో ప్రకృతి ఎరువు

మలికిపురం: కొబ్బరి డొక్కలకు నిప్పు పెట్టాల్సిన అవసరం లేదని, తోటల్లో చెట్ల మధ్య గాడులు తవ్వి డొక్కలతో పూడ్చివేస్తే అవి కుళ్లి ప్రకృతి ఎరువుగా తోటలకు బలాన్నిస్తాయని కొబ్బరి బోర్డు మాజీ సభ్యుడు ముదునూరి సీతారామ సత్యనారాయణ రాజు పేర్కొన్నారు. పి.గన్నవరం, మామిడికుదురు మండలంలో కొందరు రైతులు డొక్కలు కొనే వారు లేక తగలబెడుతున్నట్లు సాక్షిలో ఆదివారం వచ్చిన కథనంపై ఆయన స్పందించారు. కొబ్బరి తోటల్లోనే ఒలుపు చేయించి మిగిలిన డొక్కలను చెట్లకు ఎరువుగా వాడవచ్చునని ఆయన సూచించారు. కొబ్బరి డొక్క, ఆకులను కుళ్లబెట్టి కొబ్బరి తోటలకే ఎరువుగా వాడడం వల్ల భూసారం పెరగడంతో పాటు మెరక అవుతుందన్నారు.

శాఖాహారంతో ఆరోగ్య సిరి

- వ్యాధుల నుంచి రక్షణకు ఆరోగ్య నియమాలు తప్పనిసరి
- తాజా పండ్లు, ఆకుకూరల వినియోగంతో రోగ నిరోధక శక్తి
- వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత ఎంతో ముఖ్యం



కూరగాయలు

కొత్తపేట: ప్రస్తుతం ఎక్కడికక్కడ సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. సాధారణ జ్వరాలతో పాటు టైఫాయిడ్, మలేరియా, డెంగీ జ్వరాలతో జనం బాధపడుతున్నారు. గ్రామాల్లో ఆర్‌ఎంపీలు, పీఎంపీలకు, ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులకు జ్వరపీడితుల తాకిడి ఎక్కువైంది. దీనికి వర్షాకాలంతో పాటు వాతావరణం అననుకూలత ఒక కారణమైతే వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించకపోవడం, సరైన ఆహారపు అలవాట్లు లేకపోవడం, వ్యాయామానికి దూరంగా ఉండడం వల్లే వ్యాధుల బారిన పడుతున్నారని వైద్యులు అంటున్నారు. ఈ నేపథ్యంలో ఆరోగ్య నియమాలు పాటించడం ఎంతో ముఖ్యం. వ్యాధుల బారిన పడకుండా ఉండాలంటే కూరగాయలు, ఆకు కూరలతో మంచి శాఖాహారం , తగిన జాగ్రత్తలు తీసుకుంటే మేలని వైద్యులు సూచిస్తున్నారు.

నీరు, పాలకు ప్రాధాన్యం ఇవ్వాలి

పరిశుభ్రమైన, సురక్షితమైన నీటినే తాగాలి. సరిపడా నీరు తాగితే 50 శాతం రుగ్మతలు దూరమవుతాయి. ఎక్కువగా కాచి చల్లార్చిన నీటినే తీసుకోవాలి. నీటితో పాటు పాలు కూడా చాలా అవసరం. రోజుకు 250 మిల్లీలీటర్ల పాలు తాగాలి. కాఫీ, టీ అలవాటు ఉన్నవారు రోజుకు ఒకటి, రెండు సార్లు కంటే ఎక్కువ తీసుకోరాదు. ఆహారంలో పల్లీలు, మినుములు, బాదం పప్పు వంటివి ఏదో ఒకటి ఉండేలా చూసుకోవాలి. ప్రతిరోజు ఏదో ఒక ఆకుకూర 100 గ్రాములు ఉండేలా చూసుకోవాలి. జామ, నిమ్మ, ఉసిరి ఏదో ఒక దానిని తప్పకుండా తీసుకోవాలి. రోజువారీ ఆహారంలో తాజా కూరలు, కూరగాయలు, పండ్లు ఉండేలా చూసుకోవాలి. కూరగాయలు, పండ్లలో ఉండే సూక్ష్మ పోషక పదార్థాలు, ఫైబర్ శరీరానికి ఎంతో మేలు చేస్తాయి. పసుపు, నారింజ రంగులో ఉండే పండ్లు కొన్నిరకాల దీర్ఘకాలిక జబ్బులను నిరోధిస్తాయి. తాజాగా ఉండే తాజా కూరగాయలు, పండ్లను జ్యూస్ రూపంలో తీసుకోవచ్చు. మాంసాహారులైతే రోజూ ఉడికించిన గుడ్డు. వారంలో ఒకసారి చికెన్, మటన్, రొయ్యలు వంటివి స్వల్పంగా తినాలి. ప్రస్తుత వ్యాధుల సీజన్‌లో వాటికి, ఫాస్ట్‌ఫుడ్‌కు దూరంగా ఉండటమే మంచిది. నిల్వ చేసిన ఆహారం, తీపి పదార్థాలు తీసుకోకూడదు. బయట దొరికే రెడీమేడ్ ఆహారం, కూల్‌డ్రింకులు, ఫ్రిజ్‌లో నిల్వ ఉంచిన ఆహార పదార్థాలు తీసుకోకపోవడం ఉత్తమం . భోజనానికి ముందు, తర్వాత తప్పనిసరిగా సబ్బుతో చేతులను శుభ్రం చేసుకోవాలి. జలుబు, దగ్గు, ఆయాసం వంటి సమస్యల నుంచి ఉపశమనం కోసం మిరియాలు, అల్లం, వెల్లుల్లి బాగా ఉపయోగపడుతాయి. వీటిని అవసరం మేరకు వేడి నీరు, పాలు, టీలో కలుపుకుని తాగితే ఉపశమనం లభిస్తుంది.

మంచి ఆహారంతో ఆరోగ్యం



ప్రస్తుత వాతావరణ మార్పుల కారణంగా గ్రామాల్లో కొందరు జ్వరాలతో బాధపడుతున్నారు. ఆరోగ్య నియమాలు పాటించాలని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ఆహారం బాగా ఉడికించి తినాలి. ప్రతిరోజు పిల్లలు, పెద్దలు పోషకాలు ఉండే ఆహారం తీసుకోవాలి. ఆకుకూరలు, పండ్లు తినడం వల్ల శరీరానికి సరిపడా పోషకాలు అందుతాయి. సంపూర్ణ ఆరోగ్యానికి దోహదపడతాయి.

– డాక్టర్ మెంటే సుమలత, డివిజన్ వైద్యాధికారి, కొత్తపేట

యువజన విభాగం బలోపేతానికి కృషి చేయాలి



పార్టీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు రాజాను కలిసిన దేవీ ప్రకాష్

మామిడికుదురు: వైఎస్సార్ సీపీకి పూర్వ వైభవం తీసుకువచ్చే దిశగా కష్టించి పని చేయాలని పార్టీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు జక్కంపూడి రాజా, కోనసీమ జిల్లా పార్టీ అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి సూచించారు. రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శిగా నియమితులైన పి.గన్నవరం నియోజకవర్గానికి చెందిన పాముల దేవీ ప్రకాష్ ఆదివారం పార్టీ నేతలను కలిశారు. రాజమహేంద్రవరంలో రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు రాజా, అమలాపురం పార్లమెంటు పరిశీలకురాలు జక్కంపూడి విజయలక్ష్మి, గోపాలపురంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు జగ్గిరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. వారిని శాలువాలతో సత్కరించారు. దేవీ ప్రకాష్‌కు పార్టీ నేతలు శుభాకాంక్షలు తెలిపారు. యువజన విభాగాన్ని మరింత బలోపేతం చేసే దిశగా కష్టించి పని చేయాలన్నారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి, పార్టీ నేతలు జక్కంపూడి వాసు, నెల్లి దుర్గాప్రసాద్, పాలమూరి గోపాల్ ఉన్నారు.

వృద్ధుడికి ఆర్థిక సాయం



హరికృష్ణకు ఆర్థిక సాయం అందిస్తున్న సంఘ సభ్యులు

మలికిపురం: గుడిమెల్లంక పెద్ద కాలువ గట్టుకు చెందిన బత్తుల హరికృష్ణ అనే వృద్ధుడికి వైద్య ఖర్చుల కోసం గ్రామస్తులు ఆదివారం ఆర్థిక సాయం అందించారు. స్థానిక జీడీఎం గ్రూపు సభ్యులు, ఎన్నారైలు సమకూర్చిన రూ.30 వేలను సంఘ సభ్యులు అందించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు నల్లి సామ్యూల్, గెడ్డం శ్రీను, కొల్లాబత్తుల రాంబాబు, నల్లి శాంతారావు, రాపాక స్వామి, గెడ్డం శ్రీనివాస్ పాల్గొన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ

రాజోలు: రాష్ట్ర యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (ఏపీయూడబ్ల్యూజే) ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం స్థానిక ఎమ్మార్పీ కార్యాలయం వద్ద ఘనంగా నిర్వహించారు. రాజోలు సీఐ నరేష్‌కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని కేక్ కట్ చేశారు. యూనియన్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కె.సురేంద్రకుమార్ ఆధ్వర్యంలో రాజోలు సామాజిక ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. నియోజకవర్గ అధ్యక్షుడు తోట సత్యనారాయణ (చంటి), రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కె.సురేంద్రకుమార్, జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా కార్యదర్శి పి.మణికంఠ, జిల్లా సంయుక్త కార్యదర్శి దివ్వి రాఘవేంద్ర నాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యులు చింతా మధుకుమార్, కోళ్ల దుర్గాప్రసాద్, ముగ్గు ప్రసాద్ పాల్గొన్నారు.

విద్యార్థినులకు యూనిఫాం పంపిణీ

మామిడికుదురు: మొగలికుదురు జెడ్పీహెచ్ స్కూల్ ప్లస్ చదువుకున్న 21 మంది విద్యార్థినులకు రాజోలు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో యూనిఫాం పంపిణీ చేశారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు సోమిశెట్టి ఆంజనేయులు చేతుల మీదుగా ఈ పంపిణీ చేశారు. సర్పంచ్ కడి అరుణకుమారి, రోటరీ క్లబ్ కార్యదర్శి నామన షణ్ముక్, కిష్వర్ మొహిద్దీన్, పాల్గొన్నారు.